నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I | హైదరాబాద్, మంగళవారం 25 ఫిబ్రవరి 2025 | SIDDIPET

గజ్వేల్‌లోని కాలనీలో పైకి వచ్చిన మురుగు నీరు

యూజీడీ ఉన్నా.. ఇదేం కంపు!

- గజ్వేల్ బల్దియాలో పొంగిపొర్లుతున్న మురుగు
- రోడ్లపై పారుతున్న మురుగు
- పర్యవేక్షణ లేక ఎదురవుతున్న సమస్య
- ఇబ్బందుల్లో పట్టణ వాసులు

గజ్వేల్‌లోని ఎయిర్‌టెల్ టవర్ కాలనీలో చాంబర్ల ద్వారా పైకి వస్తున్న మురుగు నీరు

గజ్వేల్‌లోని ఎయిర్‌టెల్ టవర్ కాలనీలో రోడ్లపైకి చేరిన మురుగు

గజ్వేల్, ఫిబ్రవరి 24: మురుగు రహితంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా బీఆర్ఎస్ హయాంలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ(యూజీడీ) పనులు చేపట్టారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపంతో పనుల్లో నాణ్యత లోపించింది. దీంతో గజ్వేల్ పట్టణంలోని పలు కాలనీల్లో వేసిన యూజీడీ చాంబర్ల ద్వారా మురుగు పైకి ఉబికి వస్తున్నది. చాంబర్ల నుంచి మురుగు ఇండ్ల మధ్యన వేసిన చాంబర్ల గుండాపైకి రావడంతో ముక్కులు పగిలే దుర్గంధ వెదజల్లుతుండడంతో ప్రజలు ఆ వాసన భరించలేకపోతున్నారు. రూ.155 కోట్లతో యూజీడీ పనులు చేపట్టారు. పర్యవేక్షణలో భాగంగా చాంబర్లను శుభ్రం చేయడంలో చొరవ తీసుకోకపోవడంతో సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ సమస్యను బల్దియా పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.గజ్వేల్ మున్సిపాలిటీలో రూ.155 కోట్లతో 138 కిలోమీటర్ల మేర భూగర్భ మురుగు నీటి పైప్‌లైన్(యూజీడీ), నాలుగు చోట్ల సేవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు(ఎస్‌టీపీలు) నిర్మాణం చేపట్టారు. యూజీడీ ద్వారా పట్టణంలో సుమారు 9500 పైచిలుకు ఇండ్లకు కనెక్షన్లు ఇవ్వాల్సి ఉండగా, వందశాతం ఇండ్లకు ఇవ్వలేకపోయారు. ఇంకా వందల సంఖ్యలో ఇండ్లకు యూజీడీ కనెక్షన్లు ఇవ్వాల్సి ఉండడంతో మున్సిపల్ కార్యాలయం చుట్టూ పట్టణ వాసులు తిరుగుతున్నారు. అధికార యంత్రాంగం దీనిని పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

జెట్టింగ్ యంత్రాలు లేక సమస్య...

యూజీడీ చాంబర్లను క్లీనింగ్ చేయాలంటే తప్పనిసరి జెట్టింగ్ యంత్రాలు కావాల్సి ఉంది. కానీ, యూజీడీ పనులు చేసిన సంబంధిత కాంట్రాక్టర్‌కు నేటికి పూర్తిస్థాయిలో బిల్లులు చెల్లించక పోవడంతో పనులు మధ్యలోనే వదిలేశారు. దీంతో తరుచూ కాలనీల్లో చాంబర్ల నుంచి మురుగు బయటకు పొంగిపొర్లుతున్నది. దీంతో రోడ్డుపై కాలినడకన నడవలేని పరిస్థితి ఏర్పడుతున్నది. చాంబర్ల లీకేజీలతో ప్రజలు దుర్గంధాన్ని భరించలేకపోతున్నారు. యూజీడీ నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. సమస్య మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకునే వారు కరువయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎక్కడ యూజీడీ చాంబర్లు నిండినా వాటిని క్లీనింగ్ చేయడానికి జెట్టింగ్ యంత్రాలు అందుబాటులో ఉండాల్సి ఉంది. కానీ, ఇప్పటి వరకు జెట్టింగ్ యంత్రాలను తీసుకురాకపోవడంతో లీకేజీ అవుతున్న చాంబర్లను శుభ్రం చేయడంలో అలస్యం కారణంగా దుర్గంధం వెదజల్లుతున్నది.

పలు వార్డుల్లో లీకేజీల సమస్య...

గజ్వేల్ పట్టణంలోని 2,9,14వ వార్డుల్లో యూజీడీ చాంబర్లు నిండి మురుగు పైకి వస్తుండడంతో దుర్గంధంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ప్రతినెలా ఈ సమస్య ఉత్పన్నమవుతున్నదని కాలనీ వాసులు వాపోతున్నారు. చాంబర్ల నుంచి మురుగు పైకి వచ్చి రోడ్లపైకి చేరడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. గతంలో ఇదే పరిస్థితి వస్తే అధికారులు అప్పటి వరకు ఉపశమనం కలిగించేలా శుభ్రం చేశారు. కానీ, సమస్య కొద్ది రోజులుగా తరుచూ సమస్య ఎదురవుతుండడంతో కాలనీ వాసులు ఇబ్బంది పడుతున్నారు. ఎయిర్‌టెల్ టవర్ కాలనీ, లక్ష్మీప్రసన్న నగర్, పాత గజ్వేల్, బీడీ కాలనీ సమీపంతో పాటు మరిన్ని గల్లీల్లో తరుచూ ఇదే సమస్య ఎదురవుతున్నది.

సమస్యను పరిష్కరిస్తాం..

మురుగు సమస్య పరిష్కారానికి జెట్టింగ్ మిషన్ తప్పనిసరి కావాల్సి ఉంది. మున్సిపాలిటీలో అందుబాటులో లేకపోవడంతో వేరే మున్సిపాలిటీ నుంచి తెప్పించి సమస్య పరిష్కరించేందుకు కృషిచేస్తున్నాం. పనులు చేసిన కాంట్రాక్టర్‌కు రూ.50కోట్ల వరకు పెండింగ్ బిల్లులు రావాల్సి ఉంది. కాంట్రాక్టర్ మధ్యలో పనులు ఆపేశారు. దీంతో సమస్య తరుచూ తలెత్తుతున్నది. యూజీడీ చాంబర్ల ద్వారా మురుగుపైకి వస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయం వాస్తవమే. దీనికి శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు చేపడుతున్నాం.

–గోల్కొండ నర్సయ్య,
కమిషనర్ మున్సిపల్ గజ్వేల్

రేపు కొమురవెల్లి మల్లన్న 'పెద్ద పట్నం'

- భారీగా తరలిరానున్న భక్తులు
- ఏర్పాట్లు చేస్తున్న ఆలయవర్గాలు
- ప్రత్యేక బస్సులు నడుపనున్న ఆర్టీసీ

చేర్యాల, ఫిబ్రవరి 24 : సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల్లో కీలక ఘట్టమైన పెద్దపట్నం కార్యక్రమాన్ని ఈనెల 26న వైభవంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు రాష్ట్రంలోని అనేక ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు.ఆలయ ఈవో కె.రామాంజనేయులు ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. మహా శివరాత్రి రోజున ఆలయం ఎదురుగా తోట బావి ప్రాంతంలో కల్యాణ వేదిక ముందు భాగంలో అర్ధరాత్రి దాటిన తర్వాత ఒగ్గు పూజారుల ఆధ్వర్యంలో పెద్దపట్నం నిర్వహిస్తారు. కొమురవెల్లి మల్లన్న స్వామి బ్రహ్మోత్సవాల్లో కల్యాణోత్సవం, పెద్దపట్నం, అగ్నిగుండాల కార్యక్రమాలు ముఖ్యమైనవి. పెద్దపట్నం వీక్షించేందుకు భక్తులు రాత్రే మల్లన్న క్షేత్రానికి చేరుకుంటారు. పట్నం వేసే కార్యక్రమాన్ని కనులారా వీక్షించి వేకువజామున వెళ్లిపోతుంటారు. భక్తుల సౌకర్యార్థం మల్లన్న కల్యాణ వేదిక వద్ద ప్రత్యేకంగా ఎల్ఈడీ స్క్రీన్లు, గ్యాలరీలు ఏర్పాటు చేస్తున్నారు. జనగామ, సిద్దిపేట ఆర్టీసీ డిపోల నుంచి కొమురవెల్లికి ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు.

భక్తుల నమ్మకానికి ప్రతిరూపం..

ఒగ్గు పూజారులు పంచరంగులతో తయారు చేసిన పట్నం వద్ద జానపద పాటలు పాడుతూ స్వామి వారి కల్యాణోత్సవాన్ని నిర్వహించే కార్యక్రమమే పెద్దపట్నం.మహా శివరాత్రి సందర్భంగా లింగోద్భవకాలం రాత్రి 12గంటలకు మల్లికార్జున స్వామికి అర్చకులు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహిస్తారు.ప్రత్యేక పూజల అనంతరం స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ఆలయ అర్చకులు రాజగోపురం,రాతి గీరలు తదితర ప్రాంతాల్లో ఊరేగించి ఆలయంలోకి తీసుకెళ్తారు. ప్రత్యేక పూజల అనంతరం రాత్రి 2గంటల సమయంలో ఒగ్గు పూజారులు పంచ రంగులతో ముగ్గుగా వేసి పట్నంగా తయారు చేస్తారు. అనంతరం మల్లికార్జున స్వామి ఉత్సవ విగ్రహాలను పట్నం వద్దకు ఆలయ అర్చకులు తీసుకువచ్చి పూజలు నిర్వహించి ప్రదక్షణలు చేసి గర్భాలయంలోకి తీసుకెళ్తారు. ఆ తర్వాత భక్తులు పెద్ద పట్నం దాటి స్వామి వారిని దర్శించుకుంటారు. ఈ సందర్భంగా ఆలయం పసుపుమయంగా మారుతుంది.

జన జాతరకు ముస్తాబైన ఏడుపాయల

- రేపటి నుంచి మూడు రోజుల జాతర
- ఏర్పాట్లలో నిమగ్నమైన అధికారులు
- 15 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం

ముస్తాబవుతున్న ఏడుపాయల ఆలయం

పాపన్నపేట, ఫిబ్రవరి 24 : మెదక్ జిల్లా పాపన్నపేట మండలంలోని ప్రముఖ ఆలయం ఏడుపాయల దుర్గమ్మ జాతరకు ముస్తాబైంది.మహా శివరాత్రి పురస్కరించుకొని బుధవారం ప్రారంభమయ్యే జాతర మూడు రోజుల పాటు కొనసాగుతుంది. తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ నుంచి సుమారు 15 లక్షల వరకు భక్తులు వస్తారు. జిల్లా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జాతర కోసం ఏటా ప్రభుత్వం నుంచి మంజూరయ్యే రూ.2 కోట్లు ఈసారి ఇంత వరకు విడుదల కాలేదు. సింగూరు నుంచి విడుదల చేసిన 0.35 టీఎంసీల నీరు సోమవారం ఏడుపాయలకు చేరింది. మహా శివరాత్రి సందర్భంగా బుధవారం మెదటి రోజు భక్తులు మంజీరా నదిలో స్నానాలు చేసి దుర్గమ్మను దర్శించుకొని శివ దీక్షలు చేపడతారు. సాయంత్రం శివాలయంలో దీక్షలు విరమింపజేస్తారు.గురువారం జాతరలోనే ప్రధానమైన ఘట్టం బండ్ల ఊరేగింపు జరుగుతుంది. శుక్రవారం రాత్రి రథోత్సవం జరుగుతుంది. ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి, అదనపు కలెక్టర్ నగేశ్, ఆలయ ఈవో చంద్రశేఖర్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

ఏర్పాటు చేసిన స్వాగత తోరణం

వెనక్కి తగ్గం.. పోరాటంఆపం

గుమ్మడిదలలో జాతీయరహదారిపై గులబీపూలతో ర్యాలీ తీస్తున్న జేఏసీ నాయకులు

గుమ్మడిదలలో రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న పద్మశాలీ సంఘం ప్రతినిధులు

గుమ్మడిదల, ఫిబ్రవరి 24: ప్యారానగర్‌లో జీహెచ్ఎంసీ డంపింగ్‌యార్డు ఏర్పాటును ప్రభుత్వం విరమించుకునే వరకు పోరాటాం ఆపమని జేఏసీ నాయకులు తేల్చిచెప్పారు. డంపింగ్‌యార్డు ఏర్పాటు పనులు ఆపాలంటూ గుమ్మడిదలలో రైతు, మహిళా జేఏసీ నాయకులు, అఖిలపక్ష నాయకులు కలిసి సోమవారం జాతీయరహదారిపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం జేఏసీ నాయకులు తహసీల్ కార్యాలయానికి వెళ్లి నాయబ్ తహసీల్దార్ కరుణాకర్‌రావుకు, ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డికి, మున్సిపల్ కమిషనర్ రఘుకు గులాబీ పూలు అందజేసి డంపింగ్‌యార్డు అనుమతులు రద్దు చేయాలని విన్నవించారు. 20 రోజులుగా ఆందోళనలు చేస్తున్న అటు ప్రభుత్వం, ఇటు అధికారులు పట్టించుకోక పోవడంపై ఆందోళనకారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు నివేదిస్తామని తహసీల్ అధికారులు తెలిపారు. అనంతరం ర్యాలీగా దీక్షా శిబిరం వద్దకు చేరుకున్నారు. గుమ్మిడిదలలో 20వ రోజు పద్మశాలి సంఘం సభ్యులు దీక్ష చేపట్టారు. వారికి జేఏసీ కమిటీ అధ్యక్షుడు చిమ్ముల జైపాల్‌రెడ్డి, నాయకులు గోవర్ధన్ రెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు సదానందరెడ్డి, ఆలయకమిటీ అధ్యక్షుడు మద్దుల బాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ చిమ్ముల నర్సింహారెడ్డి, అఖిలపక్ష నాయకులు పుట్ట నర్సింగ్‌రావు, రాంరెడ్డి, మాజీ జడ్పీటీసీ కుమార్‌గౌడ్, ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు సంఘీభావం తెలిపారు. నల్లవల్లి, కొత్తపల్లి గ్రామాల్లో 20వ రోజు రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. ముదిరాజ్ సంఘం సభ్యులు దీక్షలో కూర్చున్నారు. నల్లవల్లి, కొత్తపల్లి, గుమ్మడిదల గ్రామాల యువకుల కొరివి శంకర్, తలారి వెంకటేశ్, రాజబోయిన సత్యనారాయణ, తలారి శోభన్, గాండ్ల బద్రి, గాండ్ల శ్రీశైలం, బొడ్డు మహేశ్, కుమ్మరి ఆంజనేయులు, ఫయాజ్ష రీఫ్, మన్నె రామకృష్ణ, రాజు గౌడ్, కొరివి సురేశ్, మల్లేశ్‌గౌడ్, ఆంజనేయులు యాదవ్, సూర్యనారాయణ, ఉదయ్‌కుమార్,శ్రవణ్, సంజీవరెడ్డి, ఆకుల సత్యనారాయణ, తూపాలకుల రాజు, లక్ష్మణ్ తదితరులు దీక్షల్లో పాల్గొన్నారు.

చెదరగొట్టేందుకు సిద్ధంగా..

డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా ఆందోళనకారులు ఎలాంటి గొడవలు చేసినా తక్షణమే వారిని చెదరగొట్టడానికి భాష్పవాయువు ప్రయోగించడానికి దీక్ష శిబిరం వద్ద 207 వజ్రాగ్యాస్ వాహనాన్ని పోలీసులు సిద్ధంగా ఉంచారు. దీంతో జేఏసీ నాయకులు రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రంగా మండిపడ్డారు. తాము డంపింగ్‌యార్డు అనుమతులు రద్దు చేయాలని శాంతియుతంగా ఆందోళనలు చేస్తుంటే ప్రభుత్వం, అధికార యంత్రాంగం మాపై కాలుదువ్వడానికి యత్నించడం తగదని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో శాంతియుతంగా నిరసనలు చేయడానికి హక్కులేదా లేదా అని ప్రశ్నించారు.

గుమ్మిడిదల తహసీల్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులకు గులాబీపూలతో విన్నవిస్తున్న జేఏసీ నాయకులు


నల్లవల్లిలో డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా రిలే నిరాహార దీక్ష చేపట్టిన ముదిరాజ్ సంఘం ప్రతినిధులు

బీరంగూడ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు

- 2లక్షల మంది భక్తులు హాజరయ్యే అవకాశం
- ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు

ఉత్సవాలకు ముస్తాబైన ఆలయం

అమీన్‌పూర్, ఫిబ్రవరి 24 : హైదరాబాద్‌కు సమీపంలోని ఉన్న బీరంగూడ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయం మహా శివరాత్రి ఉత్సవాలకు సిద్ధమైంది. నాలుగు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు ఆలయ పాలక వర్గం, దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. సుమారు 2 లక్షల వరకు భక్తులు వచ్చే అవకాశం ఉండడంతో తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. నాలుగు రోజుల పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. 27న భ్రమరాంబ మల్లికార్జున స్వామి కల్యాణం వైభవోపేతంగా నిర్వహిస్తారు. స్వామి వారికి వసంతోత్సవం, చివరి రోజు పవళింపు సేవతో ఉత్సవాలు ముగుస్తాయి. ఈ ఆలయానికి ఘనమైన చరిత్ర ఉంది. ఆలయానికి నైరుతి దిక్కునుంచి శ్రీశైలం వరకు సొరంగ మార్గం ఉన్నట్లు పెద్దలు చెబుతుంటారు. ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు కమిషనర్ జ్యోతిరెడ్డి తెలిపారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ.. జిల్లాలోనే భారీ స్థాయిలో ఉత్సవాలు నిర్వహిస్తున్న ట్లు తెలిపారు. పాలక వర్గం, అధికారులు ఏర్పాట్లతో నిమగ్న మైనట్లు ఆయన తెలిపా రు. ఎలాంటి ఇబ్బం దులు తలెత్తకుండా భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు అమీన్ పూర్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ నరేశ్ తెలిపారు. శాంతియుతంగా ఉత్సవాలు విజయవంతంగా ముగిసేందుకు భక్తులంతా పోలీసులకు, ఆలయ కమిటీకి సహకరించాలని ఆయన కోరారు.

కమిషనర్ జ్యోతిరెడ్డి

అమీన్‌పూర్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ నరేశ్

తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను నింపాలి

- సాగునీటి కోసం రైతులతో కలిసి ఉద్యమిస్తాం
- కాంగ్రెస్ నాయకులదీ అవగాహన రాహిత్యం
- కేసీఆర్ పాలనలో ఎండాకాలంలో చెరువులు కళ కళ లాడాయి
- చేర్యాల ప్రాంతంలో భూగర్భ జలాలు అడుగంటాయి
- ప్రెస్‌మీట్‌లో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాలలో విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, ఫిబ్రవరి 24: ధర్మసాగర్ నుంచి గండిరామారం వరకు ఫేజ్-2లోని రెండు మోటర్లు ఆన్‌చేసి బొమ్మకూరు, వెల్దండ, కన్నెబోయినగూడెం, లద్నూర్ రిజర్వాయర్లను నింపి, తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను గోదావరి జలాలతో నింపాలని జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం చేర్యాలలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చేర్యాల డివిజన్‌లో తపాస్‌పల్లి రిజర్వాయర్ కింద ఉన్న చెరువులు, కుంటలు, ఆయకట్టు తీవ్ర సంక్షోభంలో ఉందన్నారు. ఫిబ్రవరిలోనే భూగర్భ జలాలు అడుగంటిపోయి ప్రస్తుతం ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. బోరుబావులు ఎండిపోతున్నట్లు తెలిపారు. గతంలో 200 నుంచి 300ల ఫీట్ల లోతు బోర్లు వేస్తే సమృద్ధిగా నీళ్లు వచ్చేవని, ప్రస్తుతం 800 ఫీట్ల లోతులో బోరు వేసినా నీరు రావడం లేదన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం పదిహేను రోజుల పాటు దేవాదుల ప్రాజెక్టులోని ఆపరేషన్, మెయింటనెన్స్ సిబ్బంది వేతనాల కోసం సమ్మెకు దిగినట్లు తెలిపారు. దీంతో పదిహేను రోజులు మోటర్లను నిలిపివేశారని గుర్తు చేశారు. ఇది చాలా దురదృష్టకరమైన విషయం అని పేర్కొన్నారు. దీనిపై ఉన్నతాధికారులతో పాటు శాఖ మంత్రితో తాను మాట్లాడినట్లు తెలిపారు. దీనిపై ఏ ఒక్క అధికార పార్టీ ఎమ్మెల్యే, మంత్రి మాట్లాడలేదని విమర్శించారు. దీనిపై తాను మాట్లాడితే చివరికి ప్రభుత్వం వారికి వేతనాలు చెల్లించినట్లు ఎమ్మెలే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఎండకాలంలో కూడా చెరువులు నింపినట్లు తెలిపారు. ఆ సమయంలో 365 రోజులు చెరువులు, కుంటలు జళకళతో నిండుకుండల్లా ఉన్నట్లు తెలిపారు. కొంతమంది ఎమ్మెల్యే నీళ్లు తేవడం లేదని అజ్ఞానంతో మాట్లాడుతున్నారని, తానే స్వయంగా అధికారులు, మంత్రులతో మాట్లాడి మోటర్లు ఆన్ చేయించడంతో ప్రస్తుతం గండిరామారం నుంచి 10 క్యూబిక్ నీళ్లు వస్తున్నట్లు తెలిపారు. ఆ నీళ్లు సరిపోవని, అదనంగా నీళ్లు వదలాలని అధికారులకు పలుసార్లు విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. రెండు మూడు రోజుల్లో తపాస్‌పల్లి రిజర్వాయర్‌కు నీళ్లు విడుదల చేయాలని, లేనిపక్షంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. తపాస్‌పల్లి నుంచి ఆలేరుకు నీళ్లు వెళ్లుతున్నాయని కాంగ్రెస్ నాయకులు అవగాహన రాహిత్యంతో మాట్లాడుతున్నారని, తపాస్‌పల్లిలో నీళ్లు లేనప్పుడు ఆలేరు నీళ్లు ఎట్లా వెళ్తాయని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రశ్నించారు. అమాయక రైతులను మోసం చేసేందుకు కొంతమంది కాంగ్రెస్ నాయకులు ఇలాంటి చిల్లర ప్రచారాన్ని చేస్తున్నారని మండిపడారు. కొండపోచమ్మ ప్రాజెక్టు నుంచి మాత్రమే ఆలేరుకు నీళ్లు వెళ్తున్నాయని తెలిపారు. అంతకుముందు చేర్యాల పట్టణంలో కొత్తగా ఏర్పాటు చేసిన 'సురక్షా లెన్స్ మార్ట్ అండ్ ఆప్టికల్స్'ను ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ముస్త్యాల బాల్‌నర్సయ్య, జిల్లా నాయకుడడు అంకుగారి శ్రీధర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌కుమార్‌రెడ్డి, బీఆర్ఎస్ చేర్యాల, మద్దూరు మండల అధ్యక్షులు అనంతుల మల్లేశం, మేక సంతోశ్‌కుమార్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ పుర్మ వెంకట్‌రెడ్డి, నాయకులు పెడతల ఎల్లారెడ్డి, మంగోలు చంటి, చొప్పరి సాగర్, శివగారి అంజయ్య, బొల్లు చంద్రమౌళి, తాడెం కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కాశీకి వెళ్తూ కానరాని లోకాలకు..

- యూపీలో ఘోర రోడ్డు ప్రమాదం
- ముగ్గురు న్యాల్‌కల్ మండల వాసులు దుర్మరణం
- మృతుల్లో ఇరిగేషన్ డీఈఈ దంపతులు, కారు డ్రైవర్
- మరో ముగ్గురికి గాయాలు
- వాహనాన్ని తప్పించబోయి టిప్పరును ఢీకొట్టిన కారు
- గంగ్వార్, మల్గి గ్రామాల్లో విషాదం

రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జైన కారు

జహీరాబాద్, ఫిబ్రవరి 24 : వారణాసి దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో సంగారెడ్డి జిల్లా వాసులు ముగ్గురు దుర్మరణం చెందగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. మృతుల్లో సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం గంగ్వార్‌కు చెందిన ఇరిగేషన్ డీఈఈతో పాటు అతని భార్య, మల్గి గ్రామానికి చెందిన కారు డ్రైవర్ ఉన్నారు. తీవ్రగాయాలైన వారిలో మృతుడు డీఈ భార్య అక్క, సంగారెడ్డికి చెందిన ఉపాధ్యాయుడు మోతీలాల్, జహీరాబాద్‌కు చెందిన వ్యక్తి ఉన్నారు. గ్రామస్తులు, మృతుల కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. ఇరిగేషన్ శాఖలో కోహీర్ మండల డీఈగా పనిచేస్తున్న వెంకట్‌రామిరెడ్డి(42), అతని భార్య విలాసినీ(40), సంగారెడ్డి పట్టణానికి చెందిన ఉపాధ్యాయురాలు విశాల, మరో ఉపాధ్యాయుడు మోతీలాల్, రాయికోడ్ మండలం ఇటికేపల్లికి చెందిన జ్ఞానేశ్వర్‌రెడ్డి, న్యాల్‌కల్ మండలం మల్గి గ్రామానికి చెందిన కారు డ్రైవర్ మల్లారెడ్డి కలిసి శనివారం ఉత్తరప్రదేశ్‌లో జరుగుతున్న కుంభమేళాకు వెళ్లారు. ఆదివారం వీరంతా ప్రయాగ్‌రాజ్‌లో పుణ్యస్నానాలు ఆచరించారు. ఆదివారం సాయంత్రం కాశీ విశ్వనాథుడి దర్శనం నిమిత్తం కారులో బయలుదేరారు. ఈ క్రమంలోనే ప్రయాగ్‌రాజ్ సమీపంలో మీర్జాపూర్ జిల్లా తుల్సి గ్రామ సమీపంలోని రేవా- వారణాసి జాతీయ రహదారిపై వీరు కారు వెళ్తుండగా, అదే రహదారిపై బైక్ రైడర్స్ వెళ్తున్నారు. ఈ క్రమంలో ఒక బైక్ రైడర్ కారు ముందుకు రావడంతో ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్ రైడర్ అక్కడికక్కడే మృతిచెందాడు, కారు అదుపుతప్పి ఆగి ఉన్న టిప్పర్‌కు వేగంగా వెళ్లి ఢీకొట్టింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఇరిగేషన్ డీఈఈ వెంకట్‌రామిరెడ్డి, అతని భార్య విలాసినీ, కారు డ్రైవర్ మల్లారెడ్డి అక్కడికక్కడే మృతి చెందారు. కారులో ఉన్న డీఈ వదిన ఉపాధ్యాయురాలైన విశాల, మరో ఉపాధ్యాయుడు మోతీలాల్, జ్ఞానేశ్వర్‌కు తీవ్రగాయాలు కావడంతో అక్కడి ప్రభుత్వ దవాఖానాకు తరలించారు. సంఘటనా స్థలాన్ని వారణాసి ఎస్పీ సోమేంద్రనాథ్, అడిషనల్ ఎస్పీ ఏపీ సింగ్ సందర్శించి ఘటనపై ఆరాతీశారు.

బాధిత కుటుంబాల్లో పుట్టెడు దు:ఖం...

న్యాల్‌కల్ మండలంలోని గంగ్వార్, మల్గి గ్రామాల్లో విషాదం అలుముకుంది. మృతుడు ఇరిగేషన్ డీఈ వెంకట్‌రామిరెడ్డి స్వగ్రామం మండలంలోని మామిడ్గి కాగా, సొంత భూములు ఉండడంతో 20 ఏండ్ల క్రితం గంగ్వార్‌లో స్థిరపడ్డారు. వెంకట్‌రామిరెడ్డి చాలాకాలం ఏఈగా పనిచేశారు. ఆ తర్వాత వివిధ మండలాల్లో పనిచేసి తర్వాత డీఈగా ప్రమోషన్‌పై కోహీర్ మండలంలో విధులు నిర్వహిస్తున్నారు. సంగారెడ్డిలోని అదర్శనగర్‌లో ఆయన కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తున్నారు. ప్రతిరోజు సంగారెడ్డి నుంచి విధులకు హాజరవుతున్నారు. ప్రయాగ్‌రాజ్ కుంభమేళాకు భార్య, వదినతో పాటు మరో ఇద్దరు కలిసి వెళ్లారు. ఇరిగేషన్ డీఈ వెంకట్‌రామిరెడ్డి, అతని భార్య విలాసినీ మృతితో వారి ఇద్దరు పిల్లలు అనాథలయ్యారు. వారికి ఒక అమ్మాయి, ఒక బాబు ఉన్నారు. కారు డ్రైవర్ మల్లారెడ్డికి ఇద్దరు సంతానం, భార్య ఉన్నారు. ఈ సంఘటనలో తీవ్రగాయాలతో దవాఖానలో చికిత్స పొందుతున్న విశాల భర్త, కూతురు కొద్దిరోజుల క్రితం చనిపోయినట్టు తెలిసింది. కుటుంబ సభ్యులు మృతదేహాలను తీసుకు వచ్చేందుకు సోమవారం ప్రయాగ్‌రాజ్ బయలు దేరారు.

మృతదేహాలను తరలించేందుకు ఏర్పాట్లు

మృతులు ఇరిగేషన్ డీఈఈ వెంకట్‌రామిరెడ్డి, ఆతని భార్య విలాసినీ, కారు డ్రైవర్ మల్లారెడ్డి మృతదేహాలు గ్రామాలకు తీసుకువచ్చేందుకు న్యూఢిల్లీలోని తెలంగాణ రెసిడెంట్ కమిషనర్ ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వారణాసి, మిర్జాపూర్ జిల్లా కలెక్టర్లతో తెలంగాణ రెసిడెంట్ కమిషనర్ ఎప్పటికప్పుడు మాట్లాడుతూ మృతదేహాలను తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు. మృతుల కుటుంబాలకు సహాయ సహకారాలు అందించేందుకు సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటున్నట్టు రెసిడెంట్ కమిషనర్ కార్యాలయ అధికారులు తెలిపారు. తీవ్రం